కమనీయం.. రంగనాథుడి కల్యాణోత్సవం

- పులకించిన భక్తజనం
- నిత్య కల్యాణం పచ్చ తోరణానికి శ్రీకారం చుట్టిన జీయర్ స్వాములు


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు


గోదారంగనాథుల కల్యాణం జరిపిస్తున్న పండితులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీ గోదారంగనాథుల కల్యాణం నయన మనోహరంగా జరిగింది. ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీ గోదా రంగనాథుల కల్యాణోత్సవం త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణ, అనుగ్రహభాషణంతో ఆద్యంతం హృదయోల్లాసంగా జరిగింది. వేద పండితులు రమేష్ భట్టాచార్యులు, కిరణ్ భట్టాచార్యులు, లక్ష్మీనారాయణా చార్యులు, మహేశా చార్యులు శాస్త్రోక్తంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, యజ్ఞోపవీతధారణ, గోత్ర ప్రవరలు, పాదప్రక్షాళన, మంగళాష్టకాలు, గుడజీలకరం, మాంగళ్య పూజ, మాంగళ్య ధారణ, కన్యాదానం, అక్షతారోపణం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టి.సాయిరాం, ఎం.బాలస్వామి, వై.రమణ కళాబృందం అన్నమాచార్య కీర్తనలతో ఆద్యంతం అలరింపజేశారు.

నిత్యకల్యాణం పచ్చ తోరణానికి శ్రీకారం

విశ్వ కల్యాణ శ్రేయస్సుకై గోదాగోకులం కేంద్రంగా నిత్య కల్యాణం పచ్చ తోరణానికి త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారు శ్రీకారం చుట్టారు. ఆదివారం నుంచి 365 రోజులు స్వామివారికి ఈ కల్యాణ వైభోగం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు అనుగ్రహభాషణం చేస్తూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. దైవ కార్యాల్లో కుటుంబ సమేతంగా పాల్గొనాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, హిందూ ధర్మం గురించి తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే వివరించాలన్నారు. ఇలాంటి వేడుకల్లో పాల్గొనేలా చేస్తే పండితులు నిర్వహించే క్రతువులు తెలుస్తాయన్నారు. వేడుకల్లో పాల్గొన్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. గోదాగోకులం ధార్మిక సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఇక్కడికి వచ్చినప్పుడల్లా ఎంతో ప్రశాంతత దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ధార్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. త్రిదండి బృందావన రామానుజ జీయర్ స్వామి, త్రిదండి శఠక్షపముని రామానుజ జీయర్ స్వామి, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ గౌడ్, టీజీ శివరాజ్, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు ఎం.రాంభూపాల్‌రెడ్డి, ఇటిక్యాల పుల్లయ్య, బాల సుధాకర్, పాలాది సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి

క్లుప్తంగా

సూర్యనారాయణ స్వామికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ స్వామి

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలంలో స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకాలు, అర్చనలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా యోగి వేమన జయంతి


వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్ తదితరులు

కర్నూలు (సిటీ): స్థానిక బీ క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ వేమన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేమన ప్రజాకవి, సంఘ సంస్కర్త అని, పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలను రచించి ప్రజలను మెప్పించిన తాత్విక వేత్త అని కొనియాడారు. 'విశ్వదాభి రామ వినుర వేమ' అనే పద్యాలతో తెలుగు వారి మదిలో నిలిచిన చిరస్మరణీయుడు అని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కర్నూలు (హాస్పిటల్): జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మఠం విశ్వనాథ శాస్త్రి హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు జె.మల్లికార్జునయ్య, అధ్యక్షుడు ఆర్.మల్లేశ్వరయ్య, ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శి జె.చంద్రశేఖరయ్య, ఎం.రాజశేఖరయ్య, రుద్రయ్య, మల్లికార్జునయ్య, గంగాధర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పకుండా అమిత్‌షాకు ఏపీలో పర్యటించే అర్హత లేదన్నారు. ఆదివారం సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ, అమిత్‌షాలకు అంబేడ్కర్ అంటే చులకన భావన ఉందన్నారు. ఇది వారి అహంకారానికి నిదర్శనమన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె.జగన్నాథం, ఎస్.మునెప్ప మాట్లాడారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు


ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రా దేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వైష్ణో కృప చైతన్య ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగపడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే మానవ సంబంధాల గురించి వివరించాలన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీల రూపంలో కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కబడ్డీలో రాణించాలి

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణించాలంటే నిత్య సాధన, క్రమశిక్షణ అవసరమని సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు గోవింద్ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సీనియర్స్ స్త్రీ, పురు షుల కబడ్డీ జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబడ్డీ క్రీడ వల్ల ధైర్య సాహసాలు, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ మెరుగుపడుతుందన్నారు. కబడ్డీ జిల్లా కార్యదర్శి శుభాకర్ మాట్లాడుతూ.. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నంలోని అనకాపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో కలశ యాత్ర


కలశ యాత్రలో ఆర్యవైశ్య మహిళలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి కలశ యాత్రను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాంబొట్ల దేవాలయం నుంచి పూలబజార్ చిన్న అమ్మవారి శాల వరకు 108 మంది మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నా రు. అనంతరం శ్రీవాసవి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, కలశ జలాభిషేకం చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ పూజల్లో పాల్గొ ని మాట్లాడారు. గత 27 సంవత్సరాలుగా వాసవీ మాత దీక్ష స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు అవుతున్నారని ప్రశంసించారు. నిర్వాహకులు శేషగిరి శెట్టి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీటీల సర్వీసు పొడిగింపుపై కృతజ్ఞత


ఏపీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాజేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లకు రెండేళ్ల సర్వీసు పొడిగింపునకు కృషి చేసిన ఏపీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాజేష్‌లకు కర్నూలు జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కర్నూలు జిల్లా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీరాజు ఆధ్వర్యంలోని బృందం వారిని విజయవాడలోని తోట సుధాకర్ రెవెన్యూ సమావేశ మందిరంలో కలిశారు. రీసర్వే డీటీలను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి కృషి చేసిన వారిని కర్నూలు జిల్లా కమిటీ తరఫున సన్మానించారు. నాయకులు రామాంజనేయులు,లోకేష్ రెడ్డి వేణుగోపాల్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి సెస్సు కేటాయించాలి


మాట్లాడుతున్న అరసం జిల్లా అధ్యక్షులు కలం ప్రహ్లాద్

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం విశాలాంధ్ర కార్యాలయంలో జరిగింది. అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ మాట్లాడుతూ గ్రంథాలయం పేరుతో ప్రభుత్వం వసూలు చేస్తున్న 8 శాతం సెస్సును గ్రంథాలయాల అభివృద్ధికి మాత్రమే వెచ్చించాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ భావాలు కలిగిన కవి, రచయితలు అరసంలో సభ్యులుగా చేరవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కవితా సంకలనాన్ని అరసం ప్రచురిస్తుందన్నారు. జిల్లాలోని నూతన రచయితలు నుంచి సామాజిక కథలను సేకరించి కథా సంకలనం ప్రచురిస్తున్నామన్నారు. అరసం కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కవితలు, కథలను పంపదలిచిన వారు 99853 55456 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అరసం గౌరవ సలహాదారులు డాక్టర్ హరికిషన్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు పుల్లా రామాంజనేయులు, కేసీ మల్లికార్జున, సోమ భూపాల్, వెంకటరాముడు, వెంకటేష్, రాజా రమేష్, నగర ప్రధాన కార్యదర్శి ప్రమోద్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

కథా రచయితకు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న హరికిషన్

కర్నూలు కల్చరల్: ప్రముఖ కథా రచయిత బాల సాహితీవేత్త డాక్టర్ ఎం.హరికిషన్ తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి చిన్నబుచ్చినాయుడు స్మారక పురస్కారం అందుకున్నారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని కళా మందిరంలో జరిగిన పురస్కారాల ప్రధాన కార్యక్రమంలో తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తులసీనాథం నుంచి హరికిషన్ పురస్కారం అందుకున్నారు. పురస్కారం అందుకున్న హరికిషన్‌కు పలువురు సాహితీ వేత్తలు అభినందనలు తెలిపారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు (సిటీ): విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను ఉమ్మడి సీనియారిటీతో ఎఫ్ఏసీగా భర్తీ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్వీ కృష్ణారెడ్డి, ఎం.ధనుంజయలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఖాళీగా ఉన్న వీవైఈఓ పోస్టులను గవర్నమెంట్ వారినే ఎఫ్ఏసీలుగా నియమిస్తూ జోన్ – 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదని, కామన్ సీనియారిటీతో అర్హులైన వారికి అవకాశం కల్పించాలన్నారు. 95 శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల మనోభావాలకు భంగం కలిగించే రీతిలో ప్రభుత్వం వ్యవహరించడం సమంజసమైనది కాదన్నారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అన్ని ఉపాధ్యాయ సంఘాలపై ఉందని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్ పిలుపునిచ్చారు. సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, సుదర్శనం, ఆదినారాయణరెడ్డి, రమణయ్య, మల్లయ్య, శ్రీను లక్ష్మి, నారాయణ, వీరారెడ్డి, నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యశాల సమస్యలకు నిలయంగా మారిందని, ముఖ్యంగా క్యాజువాలిటీలో స్ట్రెచర్లు, పడకల కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. ప్రమాదాలు, క్రిమిసంహారక మందులు సేవించిన వారు, కుక్కకాటు, కాలిన గాయాల వారు, ఇలా అత్యవసర వైద్య సేవలు అందాల్సిన వారు క్యాజువాలిటీకి వస్తే డ్యూటీ డాక్టర్లు ఎక్స్‌రే స్కానింగ్‌కు రాస్తే నడవలేని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని స్ట్రెచర్‌పై తీసుకెళ్లేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వివరించారు. క్యాజువాలిటీని మూడు భాగాలుగా విభజించి గ్రీన్, ఆరెంజ్, రెడ్‌జోన్‌లుగా చేశారన్నారు. రెడ్ జోన్‌లో ఆక్సిజన్ అవసరం ఉన్న రోగులను ఒక్క బెడ్‌పై ఇద్దరిని ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన వ్యక్తులు రక్తగాయాలతో వచ్చినప్పుడు వారికి స్కానింగ్, ఎక్స్‌రేలు రాస్తే అక్కడికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్ కోసం గంటల తరబడి వేచి ఉన్నా దొరక్కపోవడంతో బంధువులు ఎలాగైనా తమ వారిని కాపాడుకోవాలనే తపనతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.లక్షలకు లక్షలు బిల్లులు చెల్లించాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించలేని వారు ప్రభుత్వ ఆసుపత్రిలోనే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని చెప్పారు. ఆసుపత్రి అభివృద్ధి గురించి గొప్పలు చెప్పే అధికారులు కనీస మౌలిక వసతులు ఎందుకు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ నాయకులు కృష్ణ, బాబయ్య, రామాంజిగౌడ్, రవి, శివ, రాంబాబు, మహేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్థలాల అమ్మకాలతో సంబంధం లేదు

కర్నూలు (టౌన్): నగరంలోని స్టాంటన్‌పురానికి చెందిన పుట్టిపోగు సోలమోన్ అనే వ్యక్తి చేస్తున్న ప్రాపర్టీ స్థలాల అగ్రిమెంట్లు, క్రయవిక్రయాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేపీబీఎస్ఎస్ (కర్నూలు పోలం బాప్టిస్టు సంఘం సమాజం) అధ్యక్షుడు రెవరెండ్ జి.రాజయ్య స్పష్టం చేశారు. స్థానిక శ్రీనివాస నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం కార్యదర్శి బి.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2012 సెప్టెంబర్ 22న క్రైస్తవ సమాజానికి చెందిన సొసైటీ స్థలాలను ఏకపక్షంగా అమ్ముతున్నట్లు ఫిర్యాదులు రావడంతో కమిటీ తీర్మానం చేసి అతన్ని తొలగించామన్నారు. ఇప్పటికీ పాత జి.పి.ఏ (జనరల్ పవర్ ఆఫ్ ఆటార్నీ) ద్వారా సమాజానికి చెందిన ప్రాపర్టీ అగ్రిమెంట్లు, అమ్మకాలు చేస్తూ తమ సంస్థకు నష్టం కలిగిస్తున్నాడని చెప్పారు. 2012 తరువాత సొసైటీ అమ్మకాలతో తమకు ఏలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కేపీబీఎస్ఎస్ బాధ్యత వహించదని వెల్లడించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు న్యూసిటీ: ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు ఐసీడీఎస్ పీడీ నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నియోజకపరిధిలో ఖాళీగా ఉన్న 6 ఆయా పోస్టులు, పాణ్యం నియోజకవర్గం పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులతో పాటు 15 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు పదో తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలని, అలాగే 18 – 35 సంవత్సరాలోపు వయసు కలిగిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో వెల్లడించారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు (అర్బన్): నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం నగరంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి పుట్టుక నుంచి చావు వరకు ప్రతి సందర్భంలో నాయీ బ్రాహ్మణుల అవసరం ఉంటుందని, అది నాయీ బ్రాహ్మణుల గొప్పతనం అన్నారు. నాయీ బ్రాహ్మణులు పెన్షన్లు ఇవ్వాలని అడుగుతున్నారని, ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న కోరికను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివ, సంఘం నాయకులు నవీన్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ ఈ నెల 20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనుంది. ఈ నెల 31 వరకు పశు ఆరోగ్య శిబిరాల కొనసాగనున్నాయి. ఇందుకోసం ప్రతి మండలంలో రెండు టీమ్‌లు ఏర్పాటు అయ్యాయి. జిల్లాలో 11.25 లక్షల గొర్రెలు, మేకలకు, 2.74 లక్షల పెద్ద పశువులకు, 33,500 దూడలకు నట్టల నివారణ మందులను తాపుతారు. పశు ఆరోగ్య శిబిరాల్లో పశు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయడం, వ్యాధి నిరోధక టీకాలు వేయడం, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తారని జిల్లా పశువసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

హాకీలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలి


ధీరజ్‌కుమార్‌కు హాకీ క్రీడా సామగ్రిని అందజేస్తున్న డాక్టర్ ప్రశాంతి శ్యామ్

కర్నూలు (టౌన్): గతంలో హాకీ అంటే కర్నూలు అనేలా పేరు ఉండేదని, క్రీడాకారులు మంచి ప్రదర్శనతో పూర్వ వైభవం తీసుకురావాలని డాక్టర్ ప్రశాంతి శ్యామ్ సూచించారు. ఆదివారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నెహ్రూ మెమోరియల్ స్కూల్ పూర్వపు విద్యార్థులు రాము, త్రినాథ్, ఈశ్వర్ సంయుక్త ఆధ్వర్యంలో 7 ఏ సైడ్ హాకీ టోర్నమెంటు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా నుంచి హాకీ క్రీడలో ఎంతోమంది క్రీడాకారులు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో పేరు గడించారన్నారు. అయితే కాలక్రమేణా హాకీలో కర్నూలు జిల్లా ప్రాభవం కోల్పోయిందన్నారు. జిల్లాలో హాకీని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాయలసీమ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ఏకాగ్రత నిరంతర సాధనతో హాకీలో ప్రతిభ చాటాలన్నారు. పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అలాగే అండర్–19 విభాగంలో జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బి.ధీరజ్‌కుమార్‌ను వారు అభినందిస్తూ రూ.10 వేలు విలువ చేసే హాకీ క్రీడా సామగ్రిని అందజేశారు. సీనియర్ హాకీ క్రీడాకారులు మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం, పంటల సరళిపై అవగాహన

- ప్రతికూల పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ సూచనలు


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటలు సాగు చేసే రైతులు వాతావరణ పరిస్థితులను తెలుసుకుంటూ, ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులు, పంటల సరళి గురించి అవగాహన కల్పించారు. పంటల దిగుబడిని వాతావరణ పరిస్థితులు ప్రభావితం చేస్తాయని చెప్పారు. పైర్లలో బెట్ట పరిస్థితులు ఏర్పడినపుడు యూరియా 2 శాతం, పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. అధిక వర్షాల సమయంలో పొలంలో నిల్వ నీటిని బయటికి పంపి పొటాష్ ఎరువులను వేసుకోవాలన్నారు. దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ.. పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. పంట మార్పిడి వల్ల నేల సారవంతం అవుతుందని, చీడపీడల బెడద తగ్గుతుందని తెలిపారు. ఇన్‌పుట్ డీలర్లు తగిన అవగాహన పెంచుకుని రైతులకు తెలియజేయాలని సూచించారు.

అలరించిన 'కనక పుష్య రాగం'


కనక పుష్య రాగం నాటికలో ఆకట్టుకున్న సన్నివేశం

కర్నూలు కల్చరల్: నగరంలోని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన 'కనక పుష్య రాగం' సాంఘిక నాటిక ప్రేక్షకులను అలరించింది. విజయవాడ దృశ్య వేదిక వారి ఆధ్వర్యంలో రాఘవ రచనలో ఎస్.కె.మిశ్రో దర్శకత్వం వహించిన ఈ నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య మాట్లాడుతూ నాటకాలు సామాజిక మార్పునకు ఉపయోగపడతాయన్నారు. నిత్య జీవితంలో జరుగుతున్న అంశాలనే నాటికలు, నాటకాలుగా రూపొందించి కళాకారులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎమ్ మోహన్ మాట్లాడుతూ నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలుగుతుందన్నారు. నాటక దర్శకులు ఎస్.కె.మిశ్రో మాట్లాడుతూ సామాజిక పరివర్తనకు సాంఘిక నాటికలు మూలమన్నారు. నాటక దర్శకునికి టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు రూ. 30వేల పారితోషికం అందించారు. కార్యక్రమ కన్వీనర్లుగా ఈశ్వరయ్య, యాగంటీశ్వరప్పలు వ్యవహరించారు. కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు క్రిష్టఫర్, ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక


సైక్లింగ్ జాతీయ జట్టుతో బురాన్‌దొడ్డి విద్యార్థిని వీరేషమ్మ (బాక్స్‌లో)

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యా ర్థిని విద్యార్థిని వీరేషమ్మ జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలలో పాల్గొనేందుకు బీహార్‌కు చేరుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలలో భాగంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆమె సత్తా చాటి జాతీయస్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం పాట్నాలో జరగనున్న పోటీల్లో పాల్గొనేందుకుగాను వీరేషమ్మ ఆదివారం జాతీయ జట్టు సభ్యులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరేషమ్మకు హెచ్ఎం నిర్మళ వసంతకుమారి, పీడీ సత్యకుమార్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కార్మిక, కర్షకుల సమస్యలపై పోరాటం


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక, కర్షక సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): దేశంలో కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. వాటి స్థానంలో గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై 52 రోజులుగా ఢిల్లీలో దీక్ష చేస్తున్న దల్లేవాల్ దీక్షను వెంటనే విరమింపజేయాలని, ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు రైతులకు గిట్టుబాటు ధర కోసం చట్టం చేయాలని కోరారు. సీఐటీయూ న్యూసిటీ కమిటీ కార్యదర్శి సాయిబాబా, నాగేశ్వరరావు, కె.ప్రభాకర్, సుధాకరప్ప పాల్గొన్నారు.